# నమస్తే తెలంగాణ

# రాజన్న సిరిసిల్ల

5 | కరీంనగర్, సోమవారం 4 మార్చి 2024 | RAJANNA SIRCILLA




పుప్పాల మమత

## రైతుకూలీ బిడ్డకు ఐదు ఉద్యోగాలు

పెగడపల్లి, మార్చి 3 : ఒక్క జాబ్ సాధించాలంటేనే అష్టకష్టాలు పడుతున్న ఈ రోజుల్లో పేద రైతుకూలీ బిడ్డ మమత ఏకంగా ఐదు ఉద్యోగాలకు ఎంపికైంది. తల్లిదండ్రులు పుప్పాల భూమయ్య, రమది పేద కుటుంబమే అయినా ఆమె మాత్రం వరుసగా జాబ్స్ సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నది. పెగడపల్లి మండలం ల్యాగలమర్రికి చెందిన ఆమె, పీజీ ఉస్మానియాలో, బీఈడీ శాతవాహన యూనివర్సిటీలో పూర్తి చేసింది. ప్రస్తుతం సిరిసిల్లలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో మూడేళ్లుగా కాంట్రాక్ట్ లెక్చరర్‌గా ఉద్యోగం చేస్తున్నది. 2023 ఆగస్టులో బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్వహించిన పోటీ పరీక్షలకు హాజరైంది. ప్రస్తుతం విడుదలైన గురుకుల ఫలితాల్లో అత్యంత ప్రతిభ చూపి ఏకంగా ఐదు ఉద్యోగాలకు ఎంపికైంది. కామర్స్ విభాగంలో డిగ్రీ లెక్చరల్ ఉద్యోగానికి రాష్ట్ర స్థాయిలో 16వ ర్యాంక్ సాధించగా, కామర్స్ విభాగంలో జూనియర్ లెక్చరర్ ఉద్యోగానికి రాష్ట్ర స్థాయిలో 6వ ర్యాంక్ సాధించింది. మున్సిపల్‌లో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ ఉద్యోగానికి రాష్ట్ర స్థాయిలో 23వ ర్యాంక్, బాసర జోన్‌లో ఒకటో ర్యాంక్‌లో నిలిచింది. అలాగే, సోషల్ విభాగంలో పీజీటీ, టీజీటీ ఉద్యోగాలకు మమత ఎంపికైంది.



పీవీ కుమార్తె శారదను సన్మానిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, తెలంగాణ బ్రాహ్మణ సంఘాల జేఏసీ కన్వీనర్ జమాలాపురం శ్రీనివాస్

## స్ఫూర్తిదాయకం పీవీ

ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

రవీంద్రభారతి, మార్చి 3: బహుముఖ ప్రజ్ఞాశాలి మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఈ తరం రాజకీయ నాయకులకు స్ఫూర్తిదాయకమని, పీవీకి అత్యున్నత భారత రత్నం అవార్డు ఇవ్వడం భారతదేశానికే గర్వకారణమని శాసనసభా వ్యవహారాలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కొనియాడారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారత రత్న అవార్డు వచ్చిన సందర్భంగా తెలంగాణ బ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం రవీంద్రభారతిలో పురస్కార సభ నిర్వహించారు. తెలంగాణ బ్రాహ్మణ సంఘాల జేఏసీ కన్వీనర్ జమాలాపురం శ్రీనివాస్ సభా అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి శ్రీధర్‌బాబు హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి, పీవీ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పీవీ కుమార్తె శారదమ్మను సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, పీవీ నరసింహారావుకు భారత రత్న ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆయన గొప్ప మేధావని, దేశంలో అనేక సంస్కరణలు తెచ్చాడని, విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడు గురుకులను స్థాపించారని చెప్పారు. పీవీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు భూపరిమితి చట్టం ప్రవేశపెట్టి తన వందల ఎకరాల భూములను దారాదత్తం చేశారని ప్రశంసించారు. ప్రభుత్వం బ్రాహ్మణుల అభ్యున్నతికి కట్టుబడి ఉందని, బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలను బ్రాహ్మణులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్, పీవీ ప్రభాకర్‌రావు, తెలంగాణ బ్రాహ్మణ సంఘాల జేఏసీ కన్వీనర్ జమాలాపురం శ్రీనివాస్, చకిలం అనిల్, రజినీరావు, డా.యజ్ఞం పవన్‌కుమార్ శర్మ, గూడ రాజేశ్వరరావు, లత తదితరులు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌తో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్, ఐడీసీ మాజీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, రఘువీర్‌సింగ్, నాయకులు



కేసీఆర్‌తో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, సిరిసిల్ల జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, నాయకులు

## బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థులుగా

# వినోద్, ఈశ్వర్

### కరీంనగర్, పెద్దపల్లి లోక్‌సభ స్థానాలకు పేర్లు ఖరారు

**త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికలకు భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) సన్నద్ధమైంది. అందులో భాగంగా కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. కరీంనగర్ నుంచి మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌ను తిరిగి బరిలోకి దింపుతుండగా, పెద్దపల్లి నుంచి సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు అవకాశమిచ్చింది. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో కేసీఆర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వీరిద్దరి పేర్లను రెండు నియోజకవర్గాల నాయకులు ఏకగ్రీవంగా ఆమోదించగా.. సోమవారం ప్రకటించే అవకాశమున్నది. దీంతోపాటు ఈనెల 12న కరీంనగర్ గడ్డపై నుంచే లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టేందుకు భారీ బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించడంతో బీఆర్‌ఎస్ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతున్నది.**

### నేడు ప్రకటించే చాన్స్

- సీనియర్లకు దక్కిన అవకాశం
- అందరి ఆమోదం మేరకు నిర్ణయం
- ఈ నెల 12న కరీంనగర్‌లో బహిరంగ సభ
- భయం అవసరం లేదు.. బాధ్యతతో పనిచేయాలని అధినేత కేసీఆర్ దిశానిర్దేశం



**బోయినపల్లి వినోద్‌కుమార్**

**పుట్టిన తేదీ** : 1959 జూలై 22
**స్థలం** : కరీంనగర్
**తల్లిదండ్రులు** : సుగుణదేవి, మురళీధర్‌రావు
**భార్య** : బీ మాధవి, ప్రముఖ వైద్యురాలు
**కొడుకులు** : డాక్టర్ ప్రతీక్, ప్రణయ్
**చదువు** : డిగ్రీ, ఎల్‌ఎల్‌బీ (కాకతీయ విశ్వవిద్యాలయం)
**వృత్తి**: 1998 వరకు న్యాయవాదిగా హైకోర్టు, వరంగల్ జిల్లా కోర్టుల్లో పనిచేశారు. బార్ కౌన్సిల్ సభ్యుడిగా, అడ్వకేట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాలో సభ్యుడిగా కొనసాగారు. 1998 నుంచి 2001 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో కేసులు వాదించారు.

**రాజకీయ జీవితం**

చదువుకునే రోజుల్లో విశ్వవిద్యాలయంలో విద్యార్థి సంఘ నాయకుడిగా పనిచేశారు. ఆలిండియా స్టూడెంట్ ఫెడరేషన్‌లో వివిధ పదవులు అలంకరించారు. సీపీఐ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శిగా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా పనిచేశారు. తర్వాత కేసీఆర్‌తో కలిసి పనిచేశారు. బీఆర్‌ఎస్ వ్యవస్థాపకుల్లో ఒకరిగా ఉన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అనుకూలంగా 32 పార్టీలను ఒప్పించడంలో కీలక పాత్ర పోషించారు. యూపీఏ తెలంగాణపై కనబరిచిన వైఖరికి నిరసగా 2008లో కేసీఆర్‌తో కలసి రాజీనామా చేశారు. 2004 నుంచి 2009 వరకు హనుమకొండ పార్లమెంట్ నియోజకవర్గ (14వ లోక్‌సభ) ఎంపీగా కొనసాగారు. 2014 నుంచి 2019 వరకు కరీంనగర్ ఎంపీగా (16వ లోక్‌సభ) కొనసాగారు. 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి చెందారు. 2019 ఆగస్టు 16 నుంచి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా 2023 అసెంబ్లీ ఎన్నికల వరకు పనిచేశారు. ప్రస్తుతం కరీంనగర్ లోక్‌సభ నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నారు.

కరీంనగర్, మార్చి 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీఆర్‌ఎస్ ముందుకు సాగుతున్నది. ఈ దిశగా అధినేత కేసీఆర్ ఇప్పటికే వ్యూహాలకు పదును పెడుతుండగా.. తాజాగా అభ్యర్థులను పేర్లను ఖరారుపై దృష్టి సారించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఆధ్యక్షతన కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాల ముఖ్యనేతల సమావేశం నిర్వహించారు. వారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకున్నారు. అందరి ఆమోదం మేరకు.. కరీంనగర్ నుంచి మాజీ ఎంపీ వినోద్‌కుమార్, పెద్దపల్లి నుంచి సీనియర్ నాయకుడు కొప్పుల ఈశ్వర్‌ను బరిలోకి దింపాలని నిర్ణయించారు. ఆ మేరకు పేర్లను వెల్లడించారు. కానీ, అధికారికంగా సోమవారం ప్రకటించే అవకాశం ఉంది. ఇటు వినోద్‌కుమార్, అటు కొప్పులను బరిలోకి దింపడం వెనుక పార్టీ భారీగానే కసరత్తు చేసినట్లు కనిపిస్తున్నది. నిజానికి వీరిద్దరూ మచ్చలేని మనుషులు, వివాదరహితులు, ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పనిచేసిన నాయకులు. అంతేకాదు, బీఆర్‌ఎస్ ఆవిర్భావం (2001) నుంచి నేటి వరకు పార్టీ కోసం పనిచేయడమే కాకుండా.. అధిష్టానం ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ వచ్చారు. రాజకీయాల్లో గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రజలతోనే మమేకమవుతూ వస్తున్నారు.

**అంచెలంచెలుగా ఎదిగిన కొప్పుల**

ఒక సాధారణ కుటుంబంలోపుట్టి.. సింగరేణి ఉద్యోగిగా రిజైన్ చేసి రాజకీయాల్లోకి ప్రవేశించిన కొప్పుల ఈశ్వర్ రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగారు. 2001నుంచి తెలంగాణ ఉద్యమానికి అండగా నిలుస్తూ.. పార్టీకి విధేయుడిగా పనిచేసిన ఆయన 2004 నుంచి ఎమ్మెల్యేగా గెలుస్తూ వచ్చారు. వరుస విజయాలతో ప్రస్థానం కొనసాగించి, అనేక బాధ్యతలను నిర్వర్తించారు. మంత్రిగానే కాదు, బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో కమిటీ సభ్యుడిగా, చీఫ్ విప్ వంటి ఎన్నోపదవులను అలంకరించారు. ప్రతి పదవికీ న్యాయం చేకూర్చడమే కాకుండా.. వివాదరహితుడిగా పేరు సంపాదించారు.



మంత్రిగా ఉన్నా.. లేదా ఇతర పదవుల్లో ఉన్నా నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందుతూ వచ్చారు. ఉమ్మడి జిల్లాలోనే మంచి పేరు పొందారు. ఒకప్పుడు విప్లవోద్యమాల్లో చురకైన పాత్ర పోషించిన కొప్పుల, ప్రత్యేకంగా పెద్దపల్లి జిల్లాలో కార్మికులతో మంచి సంబంధాలు కొనసాగించారు. సింగరేణి కార్మికుల సమస్యలను అప్పటి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో కీలక పాత్ర పోషించారు. నిగర్వి, వివాదరహితుడిగా పేరు సంపాదించిన కొప్పులకు బీఆర్‌ఎస్ అధినేత అనేక రకాలుగా అవకాశాలు కల్పిస్తూ వచ్చారు. ప్రజా సేవపై అంకితభావం, సింగరేణి కార్మికులపై అవగాహన వంటివి పరిగణలోకి తీసుకొని, తాజాగా పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కొప్పులను బరిలోకి దింపాలని నిర్ణయం తీసుకున్నారు.

**12న కరీంనగర్‌లో బహిరంగ సభ**

తెలంగాణ భవన్ వేదికగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్.. నాయకులకు రాబోయే ఎన్నికలే లక్ష్యంగా దిశానిర్దేశం చేశారు. నాయలెవ్వరూ అధైర్య పడొద్దని భరోసానివ్వడమే కాకుండా.. పార్టీ శ్రేణులు అంతా కలిసి కట్టుగా పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలని నిర్దేశం చేశారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనను ప్రజలు గమనించారని, ఇదే సమయంలో వందరోజుల కాంగ్రెస్ పాలనను చూస్తున్నారని, ప్రజలు అన్నింటినీ బేరీజు వేసుకుంటారని, వాస్తవాలను గమనిస్తున్నారని చెప్పారు. అయితే మనం ఓటమి పాలైనా.. ప్రజల పక్షాన నిలబడి పోరు చేయాలని చెప్పారు. ఎన్నికల్లో భాగంగా ఈ నెల 12న కరీంనగర్‌లోభారీ బహిరంగ సభను నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కలిసి వచ్చే ఎస్సారార్ కళాశాల వేదికగా కరీంనగర్ కదనభేరి పేరిట సభను నిర్వహించడానికి నిర్ణయం తీసుకున్నారు. ఈ సభా వేదిక ద్వారానే లోక్ సభ ఎన్నికల ప్రచారానికి కేసీఆర్ శ్రీకారం చుట్టనుండగా, సభను విజయవంతం చేసేందుకు నాయకులు అప్పడే ప్రయత్నాలు మొదలు పెట్టారు.



**కొప్పుల ఈశ్వర్**


**పుట్టిన తేదీ** : 20 ఏప్రిల్ 1959
**తల్లిదండ్రులు** : లింగయ్య–మల్లమ్మ
**స్వస్థలం** : కుమ్మరికుంట, జూలపల్లి మండలం, పెద్దపల్లి జిల్లా
**భార్య** : స్నేహలత, ఎల్‌ఎమ్ కొప్పుల ట్రస్ట్ అధ్యక్షురాలు
**కూతురు, అల్లుడు** : నందిని–అనిల్
**చదువు** : డిగ్రీ (బీఏ)
**ఉద్యోగం** : 1976లో సింగరేణిలో కోల్‌కట్టర్. 1977 నుంచి విప్లవోద్యమాల్లో చురుకైన పాత్ర పోషించారు. కార్మికుల పక్షాన పోరాటం చేస్తూనే రాజకీయాల వైపు మళ్లారు.

**రాజకీయ జీవితం**

1983లో టీడీపీలో చేరారు. మిడ్‌క్యాప్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. 1994లో మొదటిసారి మేడారం రిజర్వ్‌డ్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2001లో బీఆర్‌ఎస్‌లో చేరారు. 2004 ఎన్నికల్లో మేడారం నుంచి టీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి సమీప టీడీపీ అభ్యర్థి మాల మల్లేశంపై 56,563 ఓట్ల మెజారిటీతో ఘనవిజయం సాధించారు. 2008 తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో పార్టీ ఆదేశాల మేరకు పార్టీ శాసన సభ్యత్వానికి రాజీనామా చేశారు. అనంతరం నిర్వహించిన ఉపఎన్నికల్లో పోటీచేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిపై 28,137 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 2009 సాధారణ ఎన్నికల్లో నియోజకవర్గాల పునర్విభజన నేపథ్యంలో ధర్మపురి నియోజకవర్గం కొత్తగా ఏర్పడి ఎస్సీ రిజర్వ్‌డ్ కావడంతో అప్పటి నుంచి ఈ అసెంబ్లీ నుంచి పోటీ చేస్తూ గెలుస్తూ వస్తున్నారు. 2009, 2010, 2014, 2018లో వరుసగా నాలుగు సార్లు విజయం సాధించారు. 2014 నుంచి 2018 వరకు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 2018లో బీఆర్‌ఎస్ మేనిఫెస్టో కమిటీ సభ్యుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2019 నుంచి 2023 వరకు రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, మైనార్టీ, దివ్యాంగ, వృద్ధుల సంక్షేమ శాఖల మంత్రిగా ఉన్నారు. 2023 శానసభ ఎన్నికల్లో ఓటమి చెందారు. 2024 పెద్దపల్లి లోకసభ స్థానం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బరిలోకి దిగబోతున్నారు.

**సత్తా చాటిన వినోద్ కుమార్**

హనుమకొండ, కరీంనగర్ పార్లమెంట్ స్థానాల నుంచి ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన వినోద్‌కుమార్ లోక్‌సభలో సత్తా చాటారు. అంతకు ముందు ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం అన్ని పార్టీలను ఒకే వేదికపైకి తేవడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. అప్పుడు తెలంగాణ విషయంలో కేంద్రం నిర్లక్ష్యం చూపితే.. నిరసగా ఎంపీ పదవికి రాజీనామా చేసి తిరిగి గెలిచారు. కరీంనగర్ నియోజకవర్గ అభివృద్ధిపై వినోద్‌కుమార్ చెరగని ముద్ర వేశారు. కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వేలైన్ విషయంలో చూపిన చొరవ అంతా ఇంతా కాదు. ప్రధానితో శంకుస్థాపన చేయించే వరకు ఆయన పట్టు వదలేదు. అంతేకాదు, 2019 ఎన్నికల్లో ఓడిపోయినా ఈ లైన్ గురించి.. ఎంతోమంది కేంద్ర మంత్రులకు లేఖలు రాస్తూ.. ఫాలోఅప్ చేస్తూనే ఉన్నారు. చాలా రైళ్ల విషయంలోనూ ఆయన విజయం సాధించారు. కరీంనగర్ చుట్టూ జాతీయ రహదారులను సాధించడమే కాదు, జాతీయ రహదారుల అభివృద్ధి కోసం కరీంనగర్ కేంద్రంగా కార్యాలయాన్ని ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించారు. నిబంధనలు ఒప్పుకోకపోయినా కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ సాధించగా, ఈ ప్రాజెక్టు ఫలాలు ప్రస్తుతం ప్రజల కండ్లముందు కనిపిస్తున్నాయి. ఇటు విద్యారంగం అభివృద్ధి కోసం విశేష కృషి చేశారు. ముఖ్యంగా 2014 నుంచి 2019 వరకు కరీంనగర్ ఎంపీగా ఆయన చేసిన ప్రసంగాలు, సూచనలు, నియోజకవర్గ అభివృద్ధి కోసం చేపట్టిన కార్యక్రమాలు స్ఫూర్తిదాయకంగా నిలిచాయి. పార్లమెంట్ సాక్షిగా ఎన్నో అంశాలపై ఆయన గళమెత్తిన తీరు, సంధించిన ప్రశ్నలు అందరికీ స్ఫూర్తినిచ్చాయి. బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ ఉప నాయకుడిగా సమర్థవంతంగా పని చేయడమే కాకుండా, ఐదేళ్లలో 540 ప్రశ్నలు సంధించిన ఎంపీగా చరిత్ర సృష్టించారు. ప్రశ్నలు సంధించడంలో దేశంలోనే రెండో స్థానంలో నిలిచారు. అలాగే 106 అంశాలపై చర్చల్లో పాల్గొని అత్యధిక చర్చల్లో పాల్గొన్న ఎంపీగా రికార్డు నమోదు చేశారు. విషయ పరిజ్ఞానం, తన ప్రాంతానికి మేలు చేయాలన్న తపన, సాధించే వరకు అలుపెరగకుండా శ్రమించడం ఆయన నైజం. ఇవేకాదు, అనేక అంశాలను పరిగణలోకి తీసుకొని ఈసారి కూడా వినోద్‌కుమార్‌ను బీఆర్‌ఎస్ బరిలోకి దింపుతున్నది. ఈ నిర్ణయంపై బీఆర్‌ఎస్ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతున్నది.



ధర్మపురి: కొప్పులకు పేరు ఖరారు చేయడంపై నినదిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



వీడియోను విడుదల చేస్తున్న బీఆర్‌ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్, నాయకులు

## అభివృద్ధి కోసం తపంచే నేత వినోద్

బీఆర్‌ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీరామకృష్ణారావు

కార్పొరేషన్, మార్చి 3 : ప్రజల అభ్యున్నతి, అభివృద్ధి కోసం నిత్యం తపించే నాయకుడు మాజీ ఎంపీ వినోద్‌కుమార్ అని బీఆర్‌ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు కొనియాడారు. వచ్చే ఎంపీ ఎన్నికల్లో ఆయనను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో భాగంగా ఆయన ఎంపీ పదవికి రాజీనామా చేసి పదహారేళ్లు అవుతున్న సందర్భంగా బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో రూపొందించిన వీడియోను ఆదివారం కరీంనగర్‌లోని వినోద్‌కుమార్ క్యాంపు కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జీవీఆర్ మాట్లాడారు. రాష్ట్ర సాధన కోసం ఉద్యమ నేత కేసీఆర్‌తో కలిసి వినోద్ కుమార్ వెన్నంటి ఉండి పోరాటం చేశారని, ఎంపీ పదవికి రాజీనామా చేశారని గుర్తు చేశారు. అనంతరం జరిగిన ఉప ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచిన ఉద్యమ కెరటం అని ప్రశంసించారు. కరీంనగర్ ఎంపీగా నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి చేశారని, వెయ్యి కోట్లతో స్మార్ట్‌సిటీని తెచ్చి నగరాన్ని అభివృద్ధి చేశారని చెప్పారు. 2019లో ఓడిపోయినా అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు జక్కుల నాగరాజు, ద్యావ మధుసూదన్‌రెడ్డి, దూలం సంపత్‌గౌడ్, వంశీధర్‌రెడ్డి, సాయికృష్ణ, ఓంకార్, శ్రీను, శ్రావణ్, రాజశేఖర్, అజయ్, రమేశ్, విజేందర్‌రెడ్డి, సతీశ్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.



పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, జడ్పీ చైర్ పర్సన్ విజయ, పక్కన మేయర్ సునీల్‌రావు

## పోలియో చుక్కలు వేయిద్దాం

విద్యానగర్, మార్చి 3: ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు కరీంనగర్ జడ్పీ చైర్ పర్సన్ కనుమల్ల విజయ సూచించారు. పోలియో రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం కరీంనగర్‌లోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్)లో పల్స్ పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ పమేలా సత్పతి, నగర మేయర్ సునీల్ రావుతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పోలియో వ్యాధిని రూపుమాపేందుకు అందరూ సహకరించాలని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నదని చెప్పారు. మూడు రోజుల పాటు వైద్య సిబ్బంది పోలియో చుక్కలు వేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సుజాత, డిప్యూటీ వైద్యాధికారి జువేరియా, డీఐవో సాజిదా, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా మాస్ మీడియా అధికారి రంగారెడ్డి, ఎంసీహెచ్ సీనియర్ ఫిజీషియన్ నవీన తదితరులు పాల్గొన్నారు.



5కే రన్‌లో ఎస్పీ అఖిల్ మహాజన్, యువతీయువకులు

## 5కే రన్.. అదిరెన్

సిరిసిల్ల తెలంగాణ చౌక్, మార్చి 3 : మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం సిరిసిల్ల జిల్లా పోలీస్‌శాఖ ఆదివారం నిర్వహించిన 5కే రన్ అదిరింది. ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలెక్టర్ అనురాగ్ జయంతి ఈ రన్‌ను ప్రారంభించగా, విశేష స్పందన వచ్చింది. యువతీ యువకులు వందలాదిగా తరలివచ్చి, ఉత్సాహంగా పరుగెత్తారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దేశ భవిష్యత్తును నిర్ణయించేది యువతనేని, మత్తుకు దూరంగా ఉంటూ తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఎస్పీ మాట్లాడుతూ, యువత పురోగతికి అవరోధంగా నిలుస్తున్న గంజాయి, ఇతర మత్తు పదార్థాలను సమాజం నుంచి పూర్తిగా నిర్మూలించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని చెప్పారు. అనంతరం 15మంది విజేతలకు ఒక్కొక్కరికీ ఒక్కో సైకిల్ అందించారు.

వేములవాడ గుడి చెరువు ప్రాంగణంలో సభా స్థలాన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



## 7న వేములవాడకు సీఎం రేవంత్‌రెడ్డి

విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, మార్చి 3: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 7న వేములవాడకు రానున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. రాజన్న సన్నిధిలో శివరాత్రి ఉత్సవాల నేపథ్యంలో స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేయనున్నారని చెప్పారు. అనంతరం గుడి చెరువు వద్ద గల 30 ఎకరాల్లో నిర్వహించనున్న బహిరంగ సభలో పాల్గొంటారని వెల్లడించారు. ఆదివారం ఆయన కలెక్టర్ అనురాగ్‌జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, రాజన్న ఆలయ ఈవో కృష్ణప్రసాద్, సిరిసిల్ల కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డితో కలిసి సభాస్థలాన్ని పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. సీఎం పర్యటనకు సంబంధించి పూర్తి వివరాలను రెండురోజుల్లోగా వెల్లడిస్తామని పేర్కొన్నారు.